

అప్పావుపిల్ల
ఆత్మఘోష
—చంద్ర

అప్పావుపిళ్ళకు ఆవులింతకు అవినాభావ సంబంధముంది. అసలు అప్పావుపిళ్ళ కోసం ఆవులింత పుట్టిందా?....ఆవులింత కోసం అప్పావుపిళ్ళ పుట్టాడా? — అన్నది ఇంతవరకు తేలని సమస్య. అప్పావుపిళ్ళ ఆవులిస్తూనే నిద్రపోతాడు. నిద్రపోతూ ఆవులిస్తాడు. అయితే అప్పావుపిళ్ళ ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే మనిషి కాదు.

అప్పావుపిళ్ళ ఆవులిస్తే 'అ' కు దీర్ఘమిస్తే 'ఆం....!' అని ఆ గుణింతం దిద్దే పిల్లవాడి దీర్ఘంలా ఆరంభమై ఒక మహా గాయకుని ఆలాపనలా తారస్థాయిని చేరి అటుపై గిరికీలు కొడుతూ కింద పడుతూ మంద్రస్థాయి చేరేసరికి ఒక అయిదు నిముషాలు పట్టినట్లుంది. అందుకే అప్పావుపిళ్ళ ఆవులింత అంత ప్రసిద్ధి కెక్కింది.

అప్పావుపిళ్ళ సతీమణి కాపేరు లేదు. ఏటేటా ఉత్సవాలలో మునిగి తేలే ఊరి ముందర ముత్యాలమ్మ దేవతకా పేరు లేదు. ఎన్నికల్లో ఎదురు నిలబడితే కొమ్ములు తిరిగిన మొనగాణ్ణయినా వూరగాయ చప్పరించినంత తేలిగ్గా తలలు తీయించే పెద్దిరెడ్డి కా పేరు లేదు. పని గట్టుకుని ఈ ఇంటి

గుట్టు ఆ ఇంటికి, ఆ ఇంటిగుట్టు ఈ ఇంటికి చేరవేసి జుట్లుపట్టించి వేడుక చూసే పరదేసిగాడి కాపేరు లేదు. అయితే అప్పావుపిళ్ళ ఆవులింత మాత్రం ఆ పాయకట్టులో అద్భుతమైన పేరు మోసింది. ఎవడైనా కాస్త పొలుమాలి పగటిపూట ఆవులిస్తే చాలు — 'ఏఁవిరో! అప్పావుతో పోటీ పడేటట్లుగా ఉండావే!'—అంటూ ఎగతాళి పడతారు. అంతటితో తృప్తిపడకుండా అప్పటికి తామేదో వింతను వెదికి వెలికి తీసినట్లు సంబరపడుతూ గలగల నవ్వుతారు.

ఆవులింతకు అంత ఘనతను చేకూర్చిన అప్పావుపిళ్ళ ఆ రోజు నిద్ర లేచాడు. అయితే నిద్ర లేస్తూనే ఆవులించలేదు.

అప్పావుపిళ్ళ ఆవులించకపోయే సరికి అదేదో కొంపలు మునిగినట్లు సూర్యుడు తూర్పున్నే ఉదయించాడు. ఆ పల్లెను చుట్టుముట్టి ఉన్న చింత చెట్లమీది కాకులు మామూలుగానే అరుస్తున్నాయి. ఆడవాళ్ళు ఇంటి ముందర కళ్ళాపులు చల్లుతున్నారు. మరికొందరు ముగ్గులు వేస్తున్నారు. ఆవులించని అప్పావుపిళ్ళ మాత్రం ఆశ్చర్యంలో పడి అటుపై ఆలోచనలో మునిగిపోయాడు.

అప్పావుపిళ్ళకు ఒంటిగా పడుకునే అలవాటు లేదు. అతని కా అవసరమూ లేకపోయింది. చదువుకునే రోజుల్లో అప్పావుపిళ్ళకు అయ్యాసామి అనే స్నేహితుడు ఉండేవాడు. వాళ్ళిద్దరిది ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకునే మైత్రి. చదువుకునే కాలమంతా ఒక కంచంలో తినకపోయినా ఒక మంచంలోనే పడుకున్నారు—మరో మంచానికి గతిలేక. ఆ రోజులు అలా గడిచిపోయాయి. చదువు పూర్తయింది.

చదువు పూర్తయితే ఉద్యోగం. ఈ దేశంలో చదువుకొన్న ప్రతివాడు ఠంచనుగా పది గంటలకు ముస్తాబై ఆఫీసుకు వెళ్ళగలిగితేనే—దాని పేరు ఉద్యోగం. కడుపుకు కూడు—వలపిన సౌకర్యాలు వనగూర్చగల ఏ పని చేసినా అది ఉద్యోగ మనిపించుకోదు. అందుకే అప్పావుపిళ్ళ కూడా

ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. బతుకులేనివాడు బడి పంతులన్నారు. బతికితే బడి పంతులుగానే బతకాలి! - అనుకొన్నాడు అప్పావుపిళ్ళ. ఒక ప్రాథమిక పాఠశాలలో తాను సెకండరీ గ్రేడ్ టీచరయినా హయ్యర్ గ్రేడ్ ఖాళీనే పూర్తిచేశాడు.

చదువు....ఉద్యోగం—మనిషి బతుకుల్లో ఈ రెండు సమకూడితే కూడవలసిన మూడవది సంసారం. ఆ పనీ అయిందనిపించారు, అప్పావు పిళ్ళ తలిదండ్రులు. ఒక శుభముహూర్తాన ఏ తల్లి తండ్రులో 'అయ్యో! ఆడకూతురా!' అని కనుక్కొన్న ఒక ఆడకూతురు అప్పావుపిళ్ళ ఇంటి కిల్లాలుగా వేం చేసింది. ఆ నాటినుండి అప్పావుపిళ్ళకు ఒంటిగా పడుకునే అవసరం లేకపోయింది.

పాపం! అప్పావుపిళ్ళసతీమణి ఏ తల్లితండ్రులో కనుక్కొన్న ఆడకూతురైతే మాత్రమేం?—పతి అలవాటును అర్థం చేసుకుంది. పుట్టింటి మాట దాదాపు మరిచిపోయింది. 'ఏటా బాలింతరాలు' అనిపించుకొనింది. ఒక రికి తక్కువగా పదిమందిని కన్నది. ఒళ్ళు గుల్ల చేసుకొన్నది. అయినా ఏ మూడు నాలుగేండ్లకో ఒకసారి పుట్టింటివేపు పెండ్లికనో, పేరంటానికనో ఒక నాలుగు రోజులు వెడితే అప్పావుపిళ్ళ నానా అవస్థలు పడి పోయేవాడు. అతనికి ఒక రాగాన నిద్ర పట్టేదికాదు. గలీబు లేకుండా ఖరాబయిన దిండు నైనా గట్టిగా అదుముకొంటే కానీ నిద్ర పట్టేదికాదు. అలాంటి అప్పావు పిళ్ళ ఉన్నట్టుంచి ఏ చైనావాడో, పాకిస్తానీయుడో యుద్ధం ప్రకటించి నంత వింతగా ఈ మధ్య ఒకనాడు భార్య చెవులో చిత్రంగా ఒక ప్రకటన చేశాడు—'తన పడక ఇంట్లో నుండి వీధివసారా చేరుతుందో' అని. ఆమె నవ్వుకొనింది. యాభై రెండు నెత్తికెక్కిన మనిషి ఎక్కడ పడుకుంటే ఏముందిలే! అని సర్దుకొనింది.

ఇంటిముందు వసారాలో పడుకొనే అప్పావుపిళ్ళ ప్రతి నిత్యం అయిదు గంటలకే నిద్ర లేస్తూనే ఆవులిస్తాడు. ఆ ఆవులింత ఇటువైపు

నాలుగిండ్లకు, అటువైపుకు నాలుగిండ్లకు అలారంలా పని చేస్తుంది. 'అప్పావావులించినాడే! అయిదయింది గంట!' అంటూ అమ్మలక్కలు పనిలో పడతారు. లేవలేక లేచి నీల్గుతూ నిక్కుతూ ఇక తప్పదన్నట్లుగా పలకా పుస్తకాలు ముందుంచుకొని కండ్లు నలుపుకొంటూ గొణగడాని కారంభిస్తారు విద్యార్థులు. అదొక ఆనందం అప్పావుపిళ్ళకు. ఆ మాత్రం సామాజిక సేవ చేస్తున్నందుకు లోలోపలే గర్వం కూడా! కానీ ఆ రోజు అప్పావుపిళ్ళ నిద్ర లేచేసరికి వూరూరుగా ఇండ్లల్లోని ఆడవాళ్ళంతా వీధులమీద పడ్డారు. ఆశ్చర్యపడినాడు అప్పావుపిళ్ళ. ఆశ్చర్యంలో పడి ఆవులించిడమే మరచిపోయాడు!

ఆశ్చర్యంలోపడిన అప్పావుపిళ్ళ కాసేపు ఆలోచనలో పడ్డాడు. జరుగకూడనిదేదో జరిగిపోయినట్లు విచారపడ్డాడు. అటుపై వీధుల వంక వింతగా చూశాడు. అప్పటికే ఆడవాళ్ళు కొందరు ఇండ్ల ముందు చెత్త వూడుస్తున్నారు. కొందరు కళ్ళాపులు చల్లుతున్నారు. కొందరు ముగ్గులుపెడుతున్నారు. వాళ్ళల్లో చురుకుదనం గమనిస్తుంటే— పోటీ తత్త్వం కొట్టొచ్చినట్లు కనుపిస్తూంది. వసారాలో కూర్చుని వీధుల వంక అలా ఆశ్చర్యంతో తేరిపార చూచిన అప్పావుపిళ్ళ కడపటగా తన యింటి వాకిలివైపు చూశాడు.

పెద్దమ్మాయి పుష్పలత. చిక్కని పేడనీళ్ళతో వీధి ఈ చివర నుండి ఆ చివరి వరకు చక్కగా కళ్ళాపు చల్లింది. రంగు రంగుల ముగ్గులు పోస్తూ ఉంది. ఏమిటి విశేషం? అన్నట్లుగా ఆ ముగ్గువైపు చూశాడు అప్పావుపిళ్ళ. కన్నుల్ని నమ్మలేనట్లుగా అదుపులోకి తెచ్చుకున్నాడు. ఒక్కింత పెద్దవి చేశాడు. నిదానించి చూశాడు. ఆ ముగ్గు మధ్య అందంగా 'విష్ యు ఎ హాపీ న్యూ ఇయర్!' అని కనుపించేసరికి అప్పు డర్థమయింది అప్పావుపిళ్ళకు ఆ నాడు సంవత్సరాది అని!—అంటే జనవరి ఒకటి అని!! ముగ్గు వేస్తున్న ముద్దుల పెద్దకూతుర్ని గమనించాడు అప్పావుపిళ్ళ. ఆమె ముచ్చ

టగా వేస్తున్న రంగు రంగుల ముగ్గుల్ని చూశాడు. అప్పుడప్పుడే తొంగి చూస్తున్న ఉదయకాంతిలో ఆమె కంటే అందంగా ముగ్గు, ముగ్గుకంటే అందంగా ఆమె కనుపిస్తున్నారు. గుబురు మీసాల్ని చీల్చుకుని ఒక చిరు నవ్వు వెడలింది. అంతలోనే అతని మొగం వడలింది. ఆ అమ్మాయి వయసుకు వాళ్ళమ్మ ఒక బిడ్డతల్లి అని తోచేసరికి అప్పావుపిళ్ళ గుండెల్లో చేయి పెట్టి దేవినట్లయింది. తానొక ప్రళయ రుద్రుడు కావాలని, కట్న మడిగే ప్రతి యువకుని గొంతు కొరికి నెత్తురు తాగాలని ఆవేశపడ్డాడు అప్పావుపిళ్ళ. ఆవేశంతో అటు యిటు కదలలేకపోయాడు అప్పావుపిళ్ళ.

అంతలోనే అతని దృష్టి మారింది!

గబగబా లేవా లనుకున్నాడు. లేచినంత తొందరగానే వీధులమీద వీర విహారం చేస్తూ పోసిన ముగ్గుల్ని ఈ కాలితో ఆ కాలితో దున్నుతూ చెరిపి పారేయా లనుకొన్నాడు. అంతా చెరిపివేసిన పిదప ఆ ముగ్గుల్ని పోసిన ముద్దరాండ్రను తన కూతురితో కూడా కలిపి వరసగా నిలబెట్టి ఈ చెంపా ఆ చెంపా కసి తీరేదాకా వాయించా లనుకొన్నాడు. అనుకొన్నాడే కానీ ఆ పని చేయలేకపోయాడు. అనుకొన్న పని చేయలేనపుడు ఎవడికైనా చేత నయింది ఆలోచన కాబట్టి అందులో పడ్డాడు అప్పావుపిళ్ళ.

"అసలు ఈ జనానికి బుద్ధుందా? ఉంటే తా మెటు వెళుతున్నామో? ఆ మాత్రం అర్థం చేసుకోలేరా? తెల్లవాళ్ళు వదలిపెట్టినా వాళ్ళ ఆచార వ్యవహారాల్ని మాత్రంవదలలేక పోతున్నారే!....ఔరా తెల్లవాడా! ఎంత మంచి పునాదులు వేశావురా! పోనీ! నీ స్వార్థంతో నువ్వుచేసినా ఈ గొర్రెల ఆలోచనేమయింది? పీర్ల పండక్కు అయ్యవారికి ముడిపెడుతున్నారే! భారతీయులుగా పుట్టి పాశ్చాత్యుల వారసులమంటున్నారే ఈ వెధవలు? అసలు మనకొక సంస్కారముంది. సంస్కృతీ ఉంది. మనకూ ఒక సంవత్సరాది పండుగ ఉందని మరచి జనమరి ఒకటిమీద పడుతున్నారే ఈ మనుష్యులు! వీళ్ళకేం పోయేకాల మొచ్చిందో! పొలోమని వీధులమీద పడి ఎక్కడ

చూసినా 'విష్ యు ఎ హాపీ న్యూ ఇయర్!!' అని రకరకాల ముగ్గులు పోస్తారా! వీళ్ళందరినీ నిలువునా చీల్చినా పాపం లేదు!!"

ఈ ఆలోచనలతో కంపించిపోయాడు అప్పావుపిళ్ళ. అయితే అటు యిటు కదలలేక ఆ కుక్కి మంచానికే అతుక్కుపోయాడు. అతని తల వెనుక కనులుపుట్టి వెనుకకు చూస్తున్నాయి. గతం అందంగా కనులముందు మెదులుతూ ఉంది.

తాను పుట్టింది ఒక పల్లెటూర్లోనే అయినా ఆ పల్లెలో ఉగాదిపండుగ ఎంత సంబరంగా జరిగేది తన చిన్నతనంలో. అమ్మ కోడికూతతో మేలు కొనేది. ఇంటిల్లిపాదికీ తలంటి స్నానంచేయించేది. కొత్త బట్టలు తొడిగేది. కొత్త బెల్లంతో వేపపూత, చింతపులుసు కలిపి పచ్చిడి చేసేది. అప్పుడు అర్థం కాలేదు. కానీ ఇప్పుడు అర్థమవుతూ ఉంది ఆ పచ్చడి జీవితానికే సంకేతమని. జీవితమంటే చేదు—తీపుల సమ్మేళనమే అని. తాను వూరి మీద పడేవాడు. ఈడు వాళ్ళతో పొద్దస్తమానం గచ్చకాయ లాడేవాడు. పెద్దవాళ్ళేమో రామాలయంలో కూర్చుని పిచ్చయ్యశాస్త్రి చదువుతూంటే పంచాగం ఎంతో ఆసక్తిగా వినేవాళ్ళు. అవన్నీ యేమైనాయి ఈ నాడు? రాను రాను నాగరికత వాత పడిన మన ఆచార వ్యవహారాలు మంట గలిసి పోవలసిందేనా?

ఈ భావన మనసులో మెదిలేసరికి అప్పావుపిళ్ళ నిలువెల్లా వణికి పోయాడు. ఏదో ఘోరం జరిగిపోతున్నట్లు, భారతీయత తారుమారయిపోతు న్నట్లు తపించిపోయాడు. ఏం చేయాలి? అని తనలో తాను ప్రశ్నించు కొన్నాడు. ఏమీ చేయలేక కుక్కి మంచంలో అలానే కూలబడ్డాడు.

"ఏవండీ! ఇంకా అట్లానే కూర్చున్నారే. పొద్దు బారడెక్కింది. ఏడాది కొక్క పూట. పండగ పూటయినా పెందలాడే లేచి స్నానం చేస్తారా? లేదా?" అప్పావుపిళ్ళ సతీమణి ఇంట్లోకి జొరపడుతూ అడుగుతూ ఉంది.

మాటలో కాస్త నిష్ఠూరం చోటు చేసుకున్నా మరొకప్పుడయితే ఆ మాటల వెనుక నివురు గప్పిన అభిమానానికి నిజంగా అప్పావుపిళ్ళ ఆ కుక్కి మంచంమీదనే అందల మెక్కినంత ఆనందపడి అదో రకంగా చూసి ఇంకో రకంగా నవ్వేవాడు. కానీ ఆ నాడు సతీమణివైపు ఎటోగా చూశాడు.

పెండ్లినాటిది ఆ నాటికీ ఈ నాటికీ ఏ నాటికీ పోటీ లేకుండా నిలబడింది ఒక్కటే చీర—ధర్మవరం పేటంచు సరిగ చీర సింగారించింది. అంతకు ముందు ముందే తల స్నానం చేసినట్లుంది. తల కూడా ఆరలేదు. కాన్పుకు పిడికెడు జుట్టు ఊడిపోతే ఆ ఏటాబాలెంతరాలికి పిడికెడు జుట్టు. ఆ జుట్టు నుండి నీళ్ళు బొట్లు బొట్లుగా పడుతున్నాయి. చేతిలో హారతి తట్ట ఉంది. తట్టలో కొబ్బెర చిప్పలు పూలు పండ్లు వగైరా వగైరా ఉన్నాయి. ఆమ్మగారి మొహంలో పూజ సలిపిన సంతృప్తి చిలికిన మజ్జిగలో తేలుతున్న వెన్నెలా తేలుతూంది.

"అయితే ఏడాది కొక్కగా నొక్క పండుగని గుడిలో పూజలు చేసి వస్తూందన్నమాట ఇల్లాలు" తనలో తాను గొణుక్కున్నాడు అప్పావుపిళ్ళ. గొణుక్కొంటూ ఆగ్రహోదగ్రుడైనాడు. అటుపై ఆవేశంలో ఎగిరిపడి లేచాడు. ఆమె చేతిలోని తట్టను పెరుక్కొని విసిరి వీధిలోకి కొట్టి పిడికెడుకే అందని ఆమె జుట్టును పిడికెడు నిండుగా పట్టి మొగాన్ని వాటంగా తిప్పుకుని ఈ చెంపా ఆ చెంపా వాయించాలనుకొన్నాడు. అనుకొన్నాడే కాని ఆ పని చేయలేక అటు ఇటు కదలలేక కోపంతో కొంచెంసేపు వూగిసలాడాడు.

భర్త వైఖరి అర్థంకాక భార్య నిలువుగుడ్లతో నిలబడిపోయింది.

అక్కడనుండి ఒక్క పరుగులో దేవాలయం చేరాలనుకున్నాడు అప్పావుపిళ్ళ. ఆ దేవాలయంలో దేవుని ముందు నిలబడి 'ఒరే దేవుడా! పిళ్ళందరికీ బుద్ధి లేదనుకో! నీ బుద్ధేమయిందిరా? పీర్లపండుగనాడు నోముల వ్రత మన్నట్లు పూజలు నువ్వెట్లా గ్రహిస్తున్నావురా? అయితే—ఆ తెల్లోళ్ళు

నీ గ్గూడా వేశారన్న మాట టోపీ! అందుకే వాళ్ళందరి పూజలతో నువ్విట్లా కులుకుతున్నావు!" అని అడుగపలె ననుకున్నాడు. అయినా అడుగు ముందుకు వేయలేక ఆవు వెంట దూడలా ఆమె వెంట తలవంచుకొని లోనికి వెళ్ళాడు.

అప్పావుపిళ్ళ అభ్యంగన స్నానం చేశాడు. అంతలోపల అమ్మగారు అయ్యగారికి ఉన్న మూడు జతల బట్టల్లో అతడు కట్టుకొన్నవి మినహాయిస్తే మిగిలిన రెండు జతల్లో కాస్త కుట్లు తక్కువపడ్డ పంచెను, చొక్కాను అందించింది. అవి పాతవే!....చిరిగినవే!....అక్కడక్కడ కుట్లు పడ్డవే! అయినా ఆమె అనురాగం పాత పడలేదు. చినిగి కుట్లు పడలేదు. అందుకే ఆనందంగా అందుకొన్నాడు. అంతకంటే దర్జాగా ధరించాడు. పౌలుసులూడి పళ్ళూడిన దవడలా తయారైన గోడమీద మరకలు తేలి వేలాడుతున్న అద్దంలో తన చిరునవ్వుల చిద్విలాసాన్ని చూచుకొన్నాడు. నూగులు బియ్యం కలపోసిన స్థితిలో ఉన్న బుర్రమీసాల్ని దువ్వుకొన్నాడు. హుందాగా వసారాలోకి నడిచాడు.

ఇంటి వసారాలో అడుగుబెట్టి ఇంటి ముందు నిలబడి ఉన్న గుంపును చూసి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు అప్పావుపిళ్ళ. ఆ గుంపువైపు ఒక్కసారి తేరిపారచూశాడు. అందరూ తన బడిలోని విద్యార్థులని తోచేసరికి తోక తొక్కిన త్రాచు అయ్యాడు అప్పావుపిళ్ళ. ఒక చింతబరికె నందుకొని అందరి వీపులూ చిదగ్గొడుతూ దిక్కు కొకర్ని తరుమవలె ననుకున్నాడు.

అయ్యవారి ఆగ్రహాన్ని గుర్తించి పిల్లలు అటు యిటు కదల్లేకుండా అలాగే నిలబడిపోయారు. అప్పావుపిళ్ళ ఆలోచిస్తున్నాడు.

"అవును. ఒకనాడయితే తప్పకుండా అలా కొట్టేవాడు. ఆ రోజుల్లో ఇంటి పాఠం అప్పచెప్పకపోతే గోడకుర్చీ వేయించేవాడు. చూచివ్రాత వ్రాయకపోతే చేతివేళ్ళు విరగగొట్టేవాడు. బడికి సక్రమంగా రాకపోతే పాఠశాల అనబడే ఆ పూరింట దూలానికి వేలాడదీసి కింద నాగదాడి పట్టలు—ముళ్ళ కంపలు పరచి "ఇక బడికెగ్గొట్టను! ఎగ్గొట్టను!!" అని

'కుయ్యో! మొఱ్రో!' అని మొత్తుకునే వరకు వదిలిపెట్టేవాడు కాదు. ఇంత చేసినా పిల్లవాని భవిష్యత్తు కోసమే అని, అందులో స్వార్థం లేదని పెద్దలు భావించేవాళ్ళు. సహకరించేవాళ్ళు. కానీ రోజులు మారాయి. ఈ రోజుల్లో పిల్లవాడిని పల్లెత్తు మాటంటే—కాస్త నోరున్న తల్లి అయితే పరక చేత బట్టి, సరాసరి పాఠశాల మీద పడుతుంది! కాస్త సంస్కారమున్న ఇల్లా లయితే 'ఏం అయ్యోరా, ఈ వూళ్ళో వుండాలనా! పోవాలనా?' అని నిల దీసి అడుగుతుంది. ఎందుకీ గొడవలని ఏ గొడవా పట్టించుకోకుండా ఈ కాలం బడి పంతుళ్ళు జీతపు రాళ్ళకోసం దినాలు లెక్కపెట్టుకునే స్థితికి దిగ జారారు. కాల మహిమ! కాలంతోపాటు మనుషులు మారాలి కాబోలు!" అనుకొనేసరికి అప్పావుపిళ్ళ ముడతలు పడిన మొగంలో ఒకలేత నవ్వు వెలిసింది. ఆ నవ్వును వూతగా కొని పిల్లలు ముందు పడ్డారు.

ఒక్కొక్కడు ముందుకు వస్తున్నాడు. ఒక నిమ్మపండో, అరటి పండో ఆఖరికి ఒక చాక్లెట్టో అప్పావుపిళ్ళ చేతిలో పెడుతున్నారు. వంగి పాదాలకు నమస్కరిస్తున్నారు. అప్పావుపిళ్ళ గుండె ఆనందంతో పొంగి పోతూ ఉంది. తొలకరి చినుకులలో తడిసిన పుడమితల్లిలా హాయిగా ఉంది. వసంతాన్ని చూచిన కోయిల్లా పాడుతూ ఉంది.

రామాయణంలో పిడకల వేటలా అప్పుడు మనస్సులో మెదిలింది ఎప్పుడో విన్న విషయం. పట్టణాల్లో ఉపాధ్యాయుడూ, విద్యార్థి ఒక అగ్గి పుల్లతోనే సిగరెట్టు వెలిగించుకుంటారట! పైగా అది పొదుపు పాటించి నట్లని విర్రవీగుతారట! గురువు శిష్యుడు కలిసి ఒక టేబిల్ మీద సరస్వతీ పూజకన్న మిన్నగా బ్రాందీపూజ చేస్తారట!

అప్పావుపిళ్ళ అవమానంతో కుంచించుకుపోయాడు. తనది ఉపా ధ్యాయ కులమని చెప్పుకోవడానికి సిగ్గుపడ్డాడు. అయితే తానొక పరశు రాముడు కావాలనుకున్నాడు. గండ్రగొడ్డలి చేబూని యిలాంటి చీడపురు గుల్ని ఛేదించాలనుకున్నాడు. ఆ పని చేయలేక అంతమాత్రమైనా ఆ పల్లె

టూర్లో గురుభక్తికి మిగిలి ఉన్నందుకు సంతృప్తిపడ్డాడు. అందుకే విద్యార్థుల్ని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాడు.

ఒక్కొక్క విద్యార్థి ముందుకు వస్తున్నాడు. వంగి నమస్కరిస్తున్నాడు. ఆశీర్వాదం పొందిన ఆనందమేమో మరి!—తన్మయత్వంతో ఎగిరి గంతులు వేస్తూ గాలిలో తేలిపోతున్నాడు.

అలా ఆశీర్వదిస్తున్న అప్పావుపిళ్ళ దృష్టి ఉన్నట్లుండి ఒక పిల్లవాని మీద పడింది. వాడు గుంపుకు దూరంగా గుర్తింపబడనట్లుగా ఒదిగి నిలబడి ఉన్నాడు. ఆ తరవాత అప్పావుపిళ్ళ గుంపును చూశాడు. దాదాపు వంద మందికి పైగా ఉంటారు విద్యార్థులు. ఆ గుంపునుండి వెలివేయబడినట్లు నిలబడి ఉన్న ఆ పిల్లవాడెవరు?—

ఆ పిల్లవాడు మాదిగ గంగులుగాడి కొడుకు వెంకటయ్య!—వెంకటయ్య తన బడిలోనే అయిదవ తరగతి చదువుతున్న పదేండ్ల పిల్లవాడు!

వెంకటయ్య వైపు తదేకంగా గమనించాడు అప్పావుపిళ్ళ. వాడి గుండెల్లో గుబులు కన్నుల్లో ద్యోతకమవుతూ ఉంది. కన్నులు ఆశతో ప్రతిఫలిస్తున్నాయి. అయినా కాళ్ళకు సంకెళ్ళు!—

వాడు రావాలనుకొంటున్నాడు. నమస్కరించాలనుకొంటున్నాడు. అందరిలాగా ఆశీర్వాదం పొందాలనుకొంటున్నాడు.

అయినా వాడి ముందు వందమంది కట్టగట్టి నిలబడి ఉన్నారు.

వాళ్ళను దాటుకొని రావాలి!—అది సాధ్యమా?

పోనీ!—తనే వెళితే. అమ్మో! ఇంకేమయినా ఉందా? ఆ పల్లెటూళ్ళో ఏ రెడ్డసాని కాలుగిరి ఖణిల్లని రంకె వేస్తుందో?! ఏ నాయుడమ్మ నాల్కకొరికి నానా శాపనార్థాలు పెడుతుందో?—

వెంకటయ్య కంటే నిస్సహాయంగా నిలబడిపోయాడు అప్పావుపిళ్ళ. గుంపులో నుండి ఒక్కొక్క విద్యార్థి వస్తూనే ఉన్నాడు. నమస్కరిస్తూనే ఉన్నాడు. ఆశీర్వాదం పొంది ఆనందంతో తిరిగి వెళ్ళిపోతూనే ఉన్నాడు. యాంత్రికంగా ఆలోచిస్తున్న అప్పావుపిళ్ళ మనస్సు మాత్రం వెంకటయ్య

మీదే కొటకలాడుతూ ఉంది. ఎవడు వాడు? ఎవడు వాడు?.... అని ప్రశ్నిస్తూవే ఉంది.

ఎవడువాడా?

ఊరి ముందర టీ కొట్టులో వాడలోని వాళ్ళకోసం గుంజకు వేలాడగట్టిన సత్తులోటావాడు.

ఈ సత్తులోటా గ్లాసుగా మారి టీకొట్టులోని గ్లాసులతో కలిసిపోయేదెప్పుడు?

సమాధానం కోసం సతమతమయ్యాడు అప్పావుపిళ్ళ. ఆశించిన సమాధానం దొరక్క ఆవేదన పడ్డాడు. అయినా వెంకటయ్య కోసం అడుగు ముందుకు వేయలేక అలాగే నిస్సహాయంగా నిలబడ్డాడు. వంద మంది తరవాతనే వాడి వంతు - వంద సంవత్సరాల తరవాతనే వాడి బ్రతుకన్నట్లు!

* * *

జనవరి ఒకటినాడు ఈ సంఘటన జరిగింది. అది జరిగి ఇప్పటికి దాదాపు పదిహేను సంవత్సరాలు అయింది. ఈ పదిహేనేళ్ళలో ఆ గ్రామంలో చాలా మార్పులు వచ్చాయి. ప్రాథమిక పాఠశాల. మాధ్యమిక పాఠశాల అయింది. చదువుకొనే విద్యార్థుల సంఖ్య రెండింతలయింది. అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయుల సంఖ్య పెరిగింది. గ్రామస్థులు శ్రమదానంతో ఒక పంచాయతి కార్యాలయాన్ని నిర్మించారు. ఆ కార్యాలయంలో ఒక రేడియో వెలిసింది. సాక్షాత్తూ ఓ అమాత్య శేఖరుడే పంచాయతీ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశాడు. ఆ కార్యాలయంలోని రేడియోలో జాతీయత, నిరక్షరాస్యత, అస్పృశ్యతలాంటి పెద్ద పెద్ద మాటలు చెవులు చిల్లులు పడేలా వినిపిస్తూంటాయి. అప్పావుపిళ్ళ ఒకనాడు "హరీ!" మన్నాడు. అతని ఆత్మశాంతికి ఒక రోజున బడి మూశారు. అయినా అతని ఆత్మమాత్రం వూరి ముందరి టీ కొట్టులో గుంజకు వేలాడగట్టిన సత్తులోటా చుటూ పరిభ్రమిస్తూనే ఉంది.

—ఆంధ్రప్రభ (29-8-79)